## క్లుప్తంగా

### నేడు జాబ్‌మేళా

**మైదుకూరు :** మైదుకూరులోని శ్రీవెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో మంగళవారం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి డి.నాగార్జున ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ జాబ్ మేళాలో ముత్తూట్ ఫైనాన్స్, ఎయిల్ డిక్సన్, నవత ట్రాన్స్‌పోర్టు కంపెనీలు నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తాయని ఆయన పేర్కొన్నారు. పదో తరగతి, ఇంటర్మీడియెట్, డిగ్రీ, ఐటీఐ, డిప్లమో, బీటెక్‌తోపాటు హెవీ లైసెన్స్ కలిగి ఉన్న డ్రైవర్లు తమ బయోడేటాతోపాటు సర్టిఫికెట్లను కూడా తీసుకొని హాజరు కావాలని కోరారు. ఎంపికైన వారికి రూ.10,500 నుంచి రూ.35 వేల వరకు వేతనం ఇస్తారన్నారు.

### నేడు ప్రతిభా పరీక్ష

**ప్రొద్దుటూరు కల్చరల్ :** నేతాజీ సుభాష్ చంద్ర బోస్ జయంతిని పురస్కరించుకుని పదో తరగతి విద్యార్థులకు సాంఘికశాస్త్ర ప్రతిభా పరీక్ష నిర్వహిస్తున్నట్లు నేతాజీ సోషల్ స్టడీస్ క్లబ్ జిల్లా కన్వీనర్ భాస్కర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 9 గంటలకు శ్రీకృష్ణాలయం సభాభవనంలో పరీక్ష నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలకు చెందిన పదో తరగతి విద్యార్థులు ప్రతి పాఠశాల నుంచి తెలుగు మీడియానికి ఒకరు, ఇంగ్లిషు మీడియానికి ఒకరు పరీక్షకు హాజరు కావాలని సూచించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు తెలుగు, ఇంగ్లిషు మీడియంలకు వేర్వేరుగా నగదు బహుమతులు అందిస్తామన్నారు.

### బాధ్యతల స్వీకరణ


బద్వేలు రూరల్ ఎస్‌ఐ రవికుమార్

**గోపవరం :** బద్వేలు రూరల్ ఎస్‌ఐగా జె.రవికుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న చంద్రశేఖర్ తాళ్లప్రొద్దుటూరు ఎస్‌ఐగా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో లింగాల ఎస్‌ఐగా విధులు నిర్వర్తిస్తున్న రవికుమార్ ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. గ్రామాల్లో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా చర్యలు తప్పవన్నారు. సమస్యలు ఏవైనా ఉంటే తమ దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని కోరారు.

### జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

**ప్రొద్దుటూరు కల్చరల్ :** స్థానిక మైస్పేస్ తైక్వాండో క్లబ్ క్రీడాకారిణి అభినయ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. ఇటీవల నంద్యాలలో జరిగిన ఖేలో ఇండియా ఉమెన్ రాష్ట్రస్థాయి బాలికల 59 కిలోల విభాగంలో ప్రతిభ కనబరిచి బంగారు పతకం సాధించింది. ఫిబ్రవరి 7 నుంచి 9వ తేదీ వరకు పుదుచ్చేరిలో జరగబోవు ఖేలో ఇండియా ఫేజ్1 పోటీలలో పాల్గొననుంది. ఈ క్రీడాకారిణిని కోచ్ సలీమ్ అభినందించారు.

### జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

**ప్రొద్దుటూరు :** ప్రొద్దుటూరులో ఈ నెల 28, 29 తేదీల్లో ఏపీ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) 5వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మద్దిలేటి తెలిపారు. సోమవారం స్థానిక యూనియన్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని, సంక్షేమానికి కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఏపీ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ ఏరియా కార్యదర్శి ఏసోబ్, నాయకులు సుధాకర్, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

### ఒలివియా స్కూల్ వ్యవస్థాపకుడు మృతి


జి.ఆశీర్వాదం

**ప్రొద్దుటూరు కల్చరల్ :** స్థానిక పొట్టిపాడు రోడ్డులోని ఒలివియా హైస్కూల్ వ్యవస్థాపకుడు గద్ద ఆశీర్వాదం (85) సోమవారం అనారోగ్యంతో మృతి చెందాడు. ఈయన 1959లో దీనజన అభ్యుదయ సంఘాన్ని ఏర్పాటు చేసి పేదప్రజలకు సేవలందించారు. 2000లో ఒలివియా పాఠశాలను స్థాపించి పేదవిద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేశారు. ఆశీర్వాదం మరణం పట్ల పాఠశాల సిబ్బంది, పురప్రముఖులు సంతాపం తెలిపారు. ఉప్పొంగులో మంగళవారం ఆయన అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

# రాములోరి వేడుక.. ఆనంద గీతిక

- అంతటా 'అయోధ్య' సంబరాలు
- రామాలయాల్లో ప్రత్యేక పూజలు
- మార్మోగిన శ్రీరామనామస్మరణ

**'జయ జయ రామ.. బాల రామ' స్వాగతం.. సుస్వాగతం అంటూ భక్తులు కీర్తించారు. అయోధ్యలో బాలరాముడి విగ్రహం కొలువైన వేళ.. ఊరు, వాడా సంబరాలు అంబరాన్నంటాయి. ఆలయాల్లో శ్రీసీతారామలక్ష్మణులు, అంజనేయులుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అతంటా శ్రీరామనామస్మరణ మార్మోగింది.**


ఖాజీపేటలో శ్రీరామస్వామి చిత్రపటంతో భక్తుల ఊరేగింపు


ప్రొద్దుటూరులో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న వీహెచ్‌పీ నాయకులు, భక్తజనం

**ప్రొద్దుటూరు కల్చరల్ :** అయోధ్యలో బాలరామ విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలను పురస్కరించుకుని పట్టణంలోని పలు ఆలయాలు, హిందువులు, ఆధ్యాత్మిక సంఘాలు, విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో సోమవారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. కొందరు పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించగా, మరికొందరు ఆలయాల వద్ద పూజా కార్యక్రమాలు చేయగా, ఇంకొందరు పానకం పంపిణీ, అన్నదాన కార్యక్రమం చేసి శ్రీరామునిపై తమ భక్తిని చాటుకున్నారు. ఊరువాడా, వీధి వీధినా శ్రీ రాముని చిత్రం గల కాషాయ జెండాలను, రిబ్బన్‌లను కట్టారు. శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరిదేవి ఆలయం నుంచి విశ్వహిందూ పరిషత్, కులసంఘాలు, ధార్మిక సంస్థల ప్రతినిధులు, భక్తులు భారీ ర్యాలీ నిర్వహించారు. టూటౌన్ పోలీస్‌స్టేషన్ సమీపంలోని అంజనేయస్వామి ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. ర్యాలీలో కాషాయ జెండాలను చేతపట్టి నుదుట సింధూరం ధరించి పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. మహిళల కోలాటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమంలో ఆర్యవైశ్యసభ అధ్యక్షుడు బుశెట్టి రామ్మోహనరావు, కార్యదర్శి మురికి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. శ్రీ అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో అభయవరదా రామాంజనేయస్వామి వారికి పూజాద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు. శ్రీరామ, అన్నమయ్య సంకీర్తనలు, తాళాల భజన అలరించాయి. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, భక్తులు పాల్గొన్నారు. భక్తులకు శివోహం కమిటీ అధ్యక్షుడు శెట్టిపల్లె రాంప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ జరిగింది. వెంకటేశ్వర్ల పేటలోని సరస్వతీ విద్యామందిరంలో అయోధ్య రామమందిర ప్రాముఖ్యతను, శ్రీరాముని గొప్పతనాన్ని డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డి, సంస్కృతి స్వచ్ఛంద సేవా సంస్థ కార్యదర్శి ఒంటేరు శ్రీనివాసులరెడ్డి, విశ్రాంత ఎంఈఓ కేశవరెడ్డి విద్యార్థులకు వివరించారు. ముక్తిరామలింగేశ్వరస్వామి ఆలయంలో భక్తులు సామూహికంగా హనుమాన్ చాలీసా, భగవద్గీత పారాయణం చేశారు. సాయంత్రం 108 కలశాలలో పూజాద్రవ్యాలను తీసుకుని సీతారామలక్ష్మణ వేషధారణలో పురవీధుల్లో శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం ముక్తిరామలింగేశ్వరస్వామికి, హనుమత్ లింగేశ్వరస్వామికి కలశాలలోని పూజాద్రవ్యాలతో అభిషేకాలు చేశారు. స్థానిక శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో సీతారాముల విగ్రహాలకు విశేష అభిషేకాలు, అర్చనలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. ఆత్మారామ స్వామి ఆలయంలో సీతారాములకు ప్రత్యేక పూజలు చేశారు.

**రాజుపాళెం :** మండలంలోని గాదెగూడూరు సోమేశ్వర స్వామి ఆలయంలోని స్వాములకు సర్పంచ్ వరలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకుడు వెంకటరెడ్డి ఆధ్వర్యంలో పట్టు వస్త్రాలు సమర్పించారు. వెల్లాల పుణ్యక్షేత్రంలోని ఆలయాల్లో విశేష పూజలు చేసి తీర్థ ప్రసాదాలు అందించారు. తొండలదిన్నెలోని రామాలయంలో అల్పాహారాన్ని ఏర్పాటు చేశారు.

**బద్వేలు అర్బన్ :** పట్టణంలోని నాలుగు రోడ్ల కూడలిలో ఆర్యవైశ్య వర్తక సంఘం, వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో శ్రీరాముని పట్టాభిషేక మహోత్సవం వైభవంగా నిర్వహించారు. విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో స్థానిక నెల్లూరు రోడ్డులోని శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శ్రీరామజప మహాయజ్ఞం నిర్వహించారు. ఇక్కడ నిర్వహించిన శ్రీరామచంద్రుని వేషధారణ పోటీల్లో చిన్నారులు పాల్గొని అలరించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. సిద్దవటం రోడ్డులోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయం సమీపంలో గల కోదండరామ స్వామి దేవస్థానం, గాండ్లవీధిలోని కోదండ రామాలయం, అమ్మవారిశాలవీధిలోని రామాలయం, రాజుగారివీధిలోని రామాలయం తదితర చోట్ల ప్రత్యేక పూజలు నిర్వహించి శోభాయాత్ర నిర్వహించారు. కార్యక్రమాల్లో ఆర్యవైశ్య వర్తక సంఘం అధ్యక్షుడు కె.వి.సుబ్బారావు, విశ్వహిందూ పరిషత్ నాయకులు రామకోటిరాజు, కొండపల్లి సుభాష్‌కుమార్, సాకేఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

**కలసపాడు :** కలసపాడులోని కోదండరామాలయంలో పురోహితులు వారణాసివెంకటరణయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సెయింట్ ఆంటోనీస్ పాఠశాల యాజమాన్యం విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. చిన్నారులు వేసిన సీతారామలక్ష్మణ వేషధారణలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ చిత్తారాజశేఖర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు చిత్తాప్రభావతిలు పాల్గొన్నారు.

**పోరుమామిళ్ల :** స్థానిక టీటీడీ కల్యాణ మండపం దగ్గరున్న శ్రీ ఆంజనేయస్వామి గుడిలో ప్రత్యేక పూజలు చేశారు. రాఘవేంద్రనగర్‌కు చెందిన మహిళలు కలశాలతో ఊరేగింపుగా అక్కడికి చేరుకున్నారు. శ్రీ లక్ష్మీవెంకటేశ్వరస్వామి దేవస్థానం నుంచి 108 కలశాలతో మల్లకతువ దగ్గరున్న అభయాంజనేయస్వామి గుడికి మహిళలు ప్రదర్శనగా వెళ్లారు. రంగసముద్రం పంచాయతీ రెడ్డినగర్‌లో నిర్మించిన నూతన శ్రీ వరసిద్ధి వినాయక కోదండరామస్వామి దేవస్థానానికి రెడ్డినగర్, పరిసర వీధులకు చెందిన మహిళలు కలశాలతో వెళ్లారు. అమ్మవారిశాలలోని శ్రీ సీతారాముల ఆలయంలో ఆర్యవైశ్య మహిళలు రామనామ మంత్రాన్ని పఠించారు. వివిధ వీధులకు చెందిన ఆర్యవైశ్య మహిళలు పంచాయతీ ఆఫీసు దగ్గరున్న ఆంజనేయస్వామి ఆలయం నుంచి అమ్మవారిశాలకు కలశాలతో ప్రదర్శనగా వెళ్లారు.

**బి.కోడూరు :** మండల పరిధి పది గ్రామ పంచాయతీలలోని రామాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**కాశినాయన :** మండల పరిధి ఆకులనారాయణపల్లె దళితవాడలో అక్షింతలు పంపిణీ చేశారు.

**గోపవరం :** బెడుసుపల్లెలోని ఊరేగింపులో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. మహాకవయిత్రి మొల్ల సాహితీపీఠం కార్యాలయంలో విద్వాన్ గానుగపెంట హనుమంతరావు.. రామప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు.

**మైదుకూరు :** పట్టణంలోని గ్రామ దేవత పెద్దమ్మతల్లి వద్ద, అమ్మవాశాల, కోదండరామాలయం, గాంధీనగర్ రామాలయం, శ్రీరామ్‌నగర్ ఆలయం వద్ద భారీ స్క్రీన్లు ఏర్పాటు చేశారు. అమ్మవారిశాలలో సీతారాముల కల్యాణం నిర్వహించారు. సాయిబాబా క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వస్త్రవ్యాపారులు, సీతారామ, లక్ష్మణ, ఆంజనేయస్వామి చిత్రపటాన్ని పట్టణ వీధుల్లో ఊరేగించారు. వనిపెంట, జీవీ సత్రం రామాలయాల్లో పూజలు నిర్వహించారు.

**చాపాడు :** మండలంలోని చాపాడు, పల్లవోలు, లక్ష్మీపేట, అనంతపురం ఇలా మండలంలోని రామాలయాల వద్ద సీతారాముల సన్నిధిలో పూజలు నిర్వహించారు.

**బ్రహ్మంగారిమఠం :** బ్రహ్మంగారిమఠంలోని ఐదు రోడ్ల కూడలిలో భారీ డిజిటల్ స్క్రీన్ ఏర్పాటు చేసి బాలరాముడి విగ్రహ ప్రతిష్ట వేడుకలను ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు. అన్ని రామాలయాల వద్ద భక్తులకు అన్నదాన కార్యక్రమం జరిపారు. బ్రహ్మంగారిమఠంలోని జగన్మాత శ్రీ ఈశ్వరీదేవిమఠంలో శ్రీరామస్వామి చిత్ర పటానికి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం శ్రీరామ అక్షరాల ఆకృతిలో కమనీయంగా దీపాలంకరణ చేశారు. కార్యక్రమాలను మఠాధిపతులు శ్రీ వీరశివకుమారస్వామి ఆధ్వర్యంలో ఈఓ బీవీ జగన్ మోహన్‌రెడ్డి పర్యవేక్షణలో నిర్వహించారు.

**ఖాజీపేట :** ఖాజీపేటలోని సీతారామాలయంతోపాటు ఆంజనేయకొట్టాలు, కొత్తపేట, దుంపలగట్టు, పత్తూరు, ధాంఖాన్‌పల్లి, కొటింగురాయపల్లెతోపాటు అన్ని గ్రామాల్లో సీతారాములకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఖాజీపేట బస్టాండ్ కూడలిలో పెద్ద ఎల్ఈడీ స్క్రీన్‌ను ఏర్పాటు చేశారు. ఖాజీపేటలోని సీతారాముల ఆలయం నుంచి భక్తులు ర్యాలీని అగ్రహారంలోని శివాలయం వరకు నిర్వహించారు.


బి.మఠం: ఈశ్వరీదేవిమఠంలో జై శ్రీరామ అక్షరాల ఆకృతిలో దీపాలంకరణ


బద్వేలులో శ్రీరామ పట్టాభిషేక మహోత్సవం


ప్రొద్దుటూరు శోభాయాత్రలో రథంపై బాలరాముడి చిత్రపటం ఊరేగింపు

## అభివృద్ధి పనుల ప్రారంభం


కాలువపల్లెలో రైతు భరోసా కేంద్రం ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి

**గోపవరం :** మండలంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి సోమవారం ప్రారంభించారు. కాలువపల్లెలో నిర్మించిన రైతుభరోసా కేంద్రం, వైఎస్సార్ హెల్త్‌క్లినిక్, బేతాయపల్లెలో రైతుభరోసా కేంద్రం, పాలశీతలీకరణ కేంద్రం భవనాలను ఆయన ఆరంభించారు. మల్లెంకొండేశ్వరస్వామి ఆలయానికి వెళ్లే మార్గంలో రూ.45 లక్షలతో చేపట్టిన కల్వర్టు, సీసీ రోడ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా కాలువపల్లె, బేతాయపల్లె గ్రామాల్లో ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఎమ్మెల్సీ మాట్లాడారు. మండలంలోని 6 సచివాలయాల పరిధిలో మంజూరైన సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాలు, వైఎస్సార్ హెల్త్‌క్లినిక్‌ల భవనాలన్నీ కూడా పూర్తయినట్లు తెలిపారు.

**సీసీ రోడ్ల పనులకు శంకుస్థాపన**

కాలువపల్లె గ్రామ పంచాయతీలో ఎర్రిచిన్నాయపల్లె నుంచి కాలువపల్లెకు అసంపూర్తిగా ఉన్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను రూ.21 లక్షలు, బ్రాహ్మణపల్లె ఎస్సీ కాలనీ నుంచి మల్లెంకొండకు వెళ్లే సూరేపల్లె మలుపు వరకు రూ.12 లక్షలతో సీసీ రోడ్డు నిర్మించనున్నారు. ఈ పనులకు ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి శంకుస్థాపన చేశారు. మల్లెంకొండేశ్వరస్వామి కొండ దిగువ వరకు రోడ్డు సౌకర్యం కల్పించాలని స్థానికులు ఎమ్మెల్సీ దృష్టికి తీసుకురాగా.. ఆయన స్పందిస్తూ ఒక్క బ్రాహ్మణపల్లె పంచాయతీ పరిధిలోనే దాదాపు రూ.70 కోట్లు పలు అభివృద్ధి పనులకు ఖర్చు చేశామని, మల్లెంకొండేశ్వరస్వామి ఆలయానికి వెళ్లేందుకు బీటీ రోడ్డును మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు.

**గెలుపే ధ్యేయంగా అందరూ కలిసి పని చేయాలి**

వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, బూత్ కన్వీనర్లు, సచివాలయ కన్వీనర్లు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో పీఆర్ఆర్‌డీ ప్రభుత్వ సలహాదారు నాగార్జున రెడ్డి, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు గోపవరం మల్లికార్జునరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ పుల్లయ్య, సర్పంచ్‌లు శ్రీనివాసులు, ఓబుళం లక్ష్మీదేవి, కలువాయి లక్ష్మీదేవి, రాధాక్రిష్ణారెడ్డి, ఎంపీటీసీ రాజేశ్వరి, పార్టీ నాయకులు మల్లేష్, సుబ్బారెడ్డి, నరసింహారెడ్డి, మార్కెట్ యార్డు డైరెక్టర్ వెంకటసుబ్బారెడ్డి, మాజీ సర్పంచ్‌లు కె.వెంకటేశ్వరరెడ్డి, గుమ్మడి, రవిచంద్రారెడ్డి, హరికృష్ణారెడ్డి, కొండారెడ్డి, పంచాయతీరాజ్ ఈఈ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## అన్ని వార్డుల్లో ప్రగతి పనులు


రామాలయ నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమంలో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

**ప్రొద్దుటూరు :** పట్టణంలోని అన్ని వార్డుల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక వైఎంఆర్ కాలనీ ఎంట్రన్స్ వద్ద రూ.5 లక్షలతో సిమెంటు రోడ్డు నిర్మాణానికి ఆయన భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణంలో తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించామన్నారు. మున్సిపాలిటీల్లోని 41 వార్డుల్లో సిమెంటు రోడ్లు, డ్రైనేజీ కాలువలను నిర్మిస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి నాగరాజు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, 4వ వార్డు కౌన్సిలర్ వరికూటి ఓబుళరెడ్డి, ఆర్‌పీసీపీ మెంబర్ కాకర్ల నాగేషారెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు కామిశెట్టి బాబు, మండల కన్వీనర్ మార్తల ఓబుళరెడ్డి, రాజుపాళెం మండల కన్వీనర్ రాజారాంరెడ్డి, అటవీ అభివృద్ధి సంస్థ డైరెక్టర్ సానపురెడ్డి ప్రతాప్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ శౌరి సుభాష్‌రెడ్డి, పద్మశాలీయ సేవా సంఘం పట్టణాధ్యక్షుడు అగ్గారపు శ్రీనివాసులు, కోఆపరేటివ్ స్టోర్స్ అధ్యక్షురాలు గజ్జల కళావతి, కౌన్సిలర్ కమాల్ బాషా, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి పగిడాల దస్తగిరి, హౌస్ బిల్డింగ్ సొసైటీ డైరెక్టర్ కేకే పుల్లారెడ్డి, జిల్లా ప్రభుత్వాస్పత్రి సలహామండలి సభ్యుడు నరాల మల్లికార్జునరెడ్డి, గుమ్మళ్ల పద్మావతి, రజక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పన్నీటి కాశయ్య, ఎద్దుల రాయపురెడ్డి పాల్గొన్నారు.

**రామాలయం నిర్మాణానికి భూమిపూజ**

గోపవరం గ్రామ పంచాయతీ పరిధిలోని హౌసింగ్ బోర్డు కాలనీ పరిధిలో రామాలయ నిర్మాణానికి ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మోషె, మాజీ సర్పంచ్ దేవీప్రసాదరెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, ఎంపీటీసీలు ఓబయ్య యాదవ్, వసుంధర, వైఎస్సార్‌సీపీ నాయకులు కొండన్న, వెంకటరాముడు, అజీం, రాజకుళ్లాయప్ప, మాజీ ఎంపీటీసీ ఓబుళరెడ్డి పాల్గొన్నారు.

**ప్రసాదాల పంపిణీ**

వైఎంఆర్ కాలనీలోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రతిష్టను పురస్కరించుకుని లయన్స్ ఇంటర్నేషనల్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పూజలు చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు జొన్నలగడ్డ రామచంద్ర ప్రకాష్‌రావు, కాకమాని చంద్రమోహన్, పసుపుల సుబ్రహ్మణ్యం, కామేశ్వరరావు, బాబ్జీ, తల్లం ప్రభాకర్, సుధాకర్ గుప్తా, ఆంజనేయస్వామి ఆలయ కమిటీ చైర్మన్ తల్లం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

**విగ్రహ ప్రతిష్ఠ**

**రాజుపాళెం :** మండల పరిధి పొట్టిపాడు గ్రామంలోని దళితవాడలో పట్టాభిరాముల విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి పాల్గొన్నారు. విగ్రహ దాతలు రామచంద్రారెడ్డి, ధ్వజస్తంభ దాతలు బాలిరెడ్డి కుమారులు, ఇతర దాతల సహాయంతో ఈ ఆలయ నిర్మాణం చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు ఎంబీ శివశంకర్‌రెడ్డి, దిలీప్‌కుమార్‌రెడ్డి, ఆయా గ్రామస్తులు పాల్గొన్నారు.

## నేడు పల్లవోలులో జగనన్న ఆరోగ్య సురక్ష

**చాపాడు :** మండల పరిధి పల్లవోలు గ్రామంలోని గ్రామ సచివాలయం వద్ద మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు మండల అభివృద్ధి అధికారి శ్రీధర్‌నాయుడు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 వరకు నిర్వహించనున్న ఈ వైద్య శిబిరాన్ని గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ కోరారు.

## రామాలయ రక్షణ గోడకు భూమిపూజ


భూమిపూజ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

**ఖాజీపేట :** మండల పరిధి పుల్లూరు పంచాయతీలోని పూసలకొట్టాలు గ్రామంలో సీతారామాలయ రక్షణ గోడ నిర్మాణానికి ఎమ్మెల్యే రఘురామిరెడ్డి భూమిపూజ చేశారు. ఆ గ్రామంలో నూతనంగా నిర్మించిన సీతారామాలయం ఉంది. రక్షణగోడ నిర్మాణానికి పుల్లూరు మాజీ ఉప సర్పంచ్ ఇరగంరెడ్డి నాగేశ్వర్‌రెడ్డి రూ.5 లక్షల సొంత నిధులతో ముందుకు వచ్చారు. అందులో భాగంగానే ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, మైదుకూరు నియోజకవర్గ సమన్వయకర్త శెట్టిపల్లి నాగిరెడ్డి చేతుల మీదుగా భూమిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఐఐసీ డైరెక్టర్ గంగాధర్‌రెడ్డి, మండల కోఆప్షన్ సభ్యుడు మున్వర్, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ మురళీమోహన్‌రెడ్డి, అగ్రహారం సొసైటీ అధ్యక్షుడు రాఘవరెడ్డి, హఫీజుల్లా, కృష్ణమూర్తి, కుళ్ళాయప్ప తోపాటు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోండి

**ప్రొద్దుటూరు క్రైం :** కేంద్రం ప్రభుత్వం వైద్య, ఆరోగ్య శాఖ తరఫున అందిస్తున్న వివిధ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. స్థానిక విజయ్‌కుమార్ సర్కిల్‌లో 'వికసిత భారత సంకల్పయాత్ర' కార్యక్రమంలో భాగంగా సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి మాతృత్వ వందన యోజన పథకం కింద మొదటి సారి గర్భిణి అయితే రూ.5 వేలు, రెండో కాన్పులో ఆడబిడ్డ పుడితే రూ.6 వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు. అలాగే ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ పథకం కింద ప్రతి నెలా 9వ తేదీన ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తారని చెప్పారు. అనంతరం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి హిమబిందు, మున్సిపల్ ఇంజినీర్ సాయికృష్ణ, మున్సిపల్ ఏసీపీ మునిరత్నం, బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ గొర్రె శ్రీనివాసులు, హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటేశ్వర్లు, సీఓ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

## అధిక వేగంతో రోడ్డు ప్రమాదాలు


మాట్లాడుతున్న ఆర్టీఓ మురళీధర్

**ప్రొద్దుటూరు క్రైం :** మితిమీరిన వేగంతో వాహనాలు నడపడంతోనే ఎక్కువగా రోడ్డు ప్రమాదాల బారిన పడుతున్నారని ప్రొద్దుటూరు ఆర్టీఓ మురళీధర్ తెలిపారు. రహదారి భద్రతా మాసోత్సవాల సందర్భంగా ప్రాంతీయ రవాణాశాఖ కార్యాలయంలో సోమవారం సాయంత్రం పట్టణంలోని ఆటోలు, ట్యాక్సీ డ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ యుగంధర్ మాట్లాడుతూ అధికారులు ఎంత చెప్పినా డ్రైవర్లు రహదారి నిబంధనలను పాటించకుంటే ప్రయోజనం ఉండదన్నారు. కార్యక్రమంలో సీనియర్ ఎంవీఐ నారాయణనాయక్, ఏఓ కరిముల్లా పాల్గొన్నారు.




## తనిఖీల పేరుతో ఇబ్బంది పెట్టడం తగదు

**ప్రొద్దుటూరు కల్చరల్ :** పోలీసులు తనిఖీల పేరుతో ప్రజలు, వ్యాపారస్తులను ఇబ్బంది పెట్టడం తగదని ది ప్రొద్దుటూరు షరాబు మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కొప్పర్తి మధుసూదన్ పేర్కొన్నారు. సోమవారం తమ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల కోడ్ వచ్చిన తరువాత తనిఖీలు నిర్వహించడం పరిపాటని, అయితే ఈ సారి కోడ్‌కు ముందుగానే పోలీసులు తనిఖీలు చేస్తున్నారన్నారు. ఎన్నికల సంఘం ఉద్దేశం ఒకలా ఉంటే కింది స్థాయి సిబ్బంది మరొక విధంగా వ్యవహరిస్తున్నారన్నారు. 1, 2 లక్షల రూపాయలతో బంగారం కొనుగోలు కోసం వచ్చే వారిని తనిఖీ చేసి సీజ్ చేసి తిరుపతి ఆదాయపన్ను శాఖ వారికి అప్పగించడం వల్ల.. వారు తిరిగి డబ్బులు పొందేందుకు ఎన్నో వ్యయప్రయాసలకు గురవుతున్నారన్నారు. తనిఖీ చేసే అధికారులు ప్రజలు రోజువారి అవసరాల కోసం, వ్యాపారం కోసం, పెళ్లిళ్ల కోసం వాడే డబ్బు ఎన్నికల కోసం వాడే డబ్బు, వస్తువుల మధ్య తేడాను గుర్తించాలన్నారు. సాక్ష్యాధారాలు చూపిన కూడా కొందరు ఐటీ అధికారులకు స్వాధీనం చేయడం సరికాదన్నారు. ఎవరి అనుమతి తీసుకోవాలి, ఏ పత్రాలు అనుమతులు తీసుకోవాలో అధికారులు స్పష్టం చేయాల్సిన అవసరం ఉందన్నారు. అధికారులు తనిఖీపై ప్రకటన చేసి ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో షరాబు వ్యాపారస్తుల సంఘం కార్యదర్శి కేవీ చలపతి, జాయింట్ సెక్రటరీ అలవల మహేష్ పాల్గొన్నారు.

## అంగన్‌వాడీల అరెస్టుపై నిరసన

**ప్రొద్దుటూరు :** విజయవాడలో ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న అంగన్‌వాడీలకు సంఘీభావంగా చలో విజయవాడ కార్యక్రమం చేపట్టిన సందర్భంగా.. పోలీసులు అంగన్‌వాడీలను అరెస్టు చేసినందుకు వ్యతిరేకంగా సోమవారం ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకులు నిరసన తెలిపారు. స్థానిక రాజీవ్ సర్కిల్‌లో ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బి.రామయ్య, నాయకులు మద్దిలేటి, ఏసోబ్, సుబ్బరాయుడు, అంగన్‌వాడీ నాయకురాళ్లు గౌసియా, గురుదేవి, సుభాషిణి పాల్గొన్నారు. సీఐటీయూ ఆధ్వర్యంలో తాలూకా పోలీస్‌స్టేషన్ వద్ద ధర్నా చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, పట్టణ కార్యదర్శి విజయకుమార్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి సాల్మన్, అధ్యక్షుడు చంటి, కోశాధికారి రాఘశ, ఆటో యూనియన్ కార్యదర్శి శేఖర్, డేవిడ్, ఐద్వా జిల్లా కార్యదర్శి ముంతాజ్‌బేగం, వెంకటసుబ్బమ్మ, రాములమ్మ, లక్ష్మీదేవి, అంగన్‌వాడీ యూనియన్‌నాయకులు సునీత, సువార్తమ్మ తదితరులు పాల్గొన్నారు.

**పోరుమామిళ్ల :** అంగన్‌వాడీల డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలని ఎస్టీయు రాష్ట్ర కౌన్సిలర్ పి. రమణారెడ్డి అన్నారు. స్థానిక ఎస్టీయూ కార్యాలయంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్టీయూ నాయకులు పాల్గొన్నారు.

